క్లుప్తంగా

ఆలయ భూముల లీజు రద్దు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తుర్కయంజాల్: ఇంజాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయ భూముల లీజును వెంటనే రద్దు చేయాలని కోరుతూ రైతులు.. శనివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కనీస సమాచారం ఇవ్వకుండా అధికారులు ఏకపక్షంగా వేలం వేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్, బొక్క వంశీదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తను వేరుచేయాలి



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుర్కయంజాల్: తడి, పొడి చెత్తను ఇళ్ల నుంచే వేరు చేసి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి ప్రజలను కోరారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం పలు వార్డుల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛ ఆటోలకు మాత్రమే చెత్తను అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వినయ్ ఉన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి



గోవర్ధన్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ 2025– 26 ఏడాదికి నూతన అధ్యక్షుడిగా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన కె.గోవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. పట్టణంలోని లయన్స్ సేవాభవన్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శిగా గంప శ్రీను, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌ఓగా పాషా, ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కొర్పి వెంకటయ్య, టేమర్‌గా చేగురి వెంకటేశ్, టేల్ ట్విస్టర్‌గా మోహన్ రెడ్డి, డైరెక్టర్లుగా సునంద, చంద్రశేఖర్, వెంకటేశ్, రాంచంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జూలురి రమేశ్, అర్థం మనోహర్, కండె ఓంకారం, రాంరెడ్డిలను ఎన్నుకున్నారు. అలాగే లియోక్లబ్ అధ్యక్షుడిగా శ్యాంసుందర్, కార్యదర్శిగా శశిదర్, కోశాధికారిగా దర్మేందర్‌లను ఎనుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు ఈ నెల 16న కడ్తాల్ మండలం మైసిగండి ఎంఆర్‌జీ ఫంక్షన్ హాలులో ప్రమాణం చేయనున్నారని క్లబ్ పీఆర్‌ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

ఆమనగల్లు: జూన్ 6వ తేదీ లోపు పట్టా పాసుపుస్తకం పొందిన రైతులు, రైతుభరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన పాసుపుస్తకం కాపీ, ఆధార్‌కార్డు, బ్యాంకు బుక్ జిరాక్స్‌ను దరఖాస్తు ఫారంకు జతచేసి ఈనెల 18వ తేదీ లోపు వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అలాగే.. రైతు భరోసా బ్యాంకు అకౌంట్‌ను మార్చుకోవాలని అనుకునే రైతులు, 18వ తేదీలోపు వివరాలను ఇవ్వాలని పేర్కొన్నారు.

కాల్వలో మట్టి పోసింది నిజమే



కాల్వను పరిశీలిస్తున్న డీఈఈ చెన్న కేశవరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: దాతర్ చెరువు కాల్వలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టి పోసి పూడ్చింది నిజమేనని ఇరిగేషన్ డీఈఈ చెన్నకేశవరెడ్డి తెలిపారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి కొంగరకలాన్‌లో దాతర్ చెరువు నుంచి వచ్చే వరద కాల్వను డీఈ పరిశీలించి మాట్లాడారు. కాల్వలో మట్టిని నింపి, కబ్జాకు యత్నించారని పేర్కొన్నారు. కాల్వను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో గ్రామ నక్ష ప్రకారం సర్వే చేస్తామని, ఆక్రమణకు గురైనట్లు తేలితే.. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పార్కు స్థలాలు కబ్జా!

- ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూములు అన్యాక్రాంతం
- రెచ్చిపోతున్న రియల్ మాఫియా
- పట్టించుకోని మున్సిపాలిటీ యంత్రాంగం



కమ్మగూడలో పార్కు స్థలాన్ని జేసీబీతో చదును చేయిస్తున్న అక్రమార్కులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో పార్కులు, ప్రజా ప్రయోజనార్థం వెంచర్లలో వదిలిన స్థలాలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. అయినా మున్సిపాలిటీ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే తుర్కయంజాల్, మన్నెగూడ, ఇంజాపూర్, మునగనూర్, తొర్రూర్, కొహెడ రెవెన్యూ పరిధి అనేక వెంచర్లలోని జాగలను రియల్ ఎస్టేట్ మాఫియా మాయం చేసింది. గతంలో ఉన్న లోసుగులను ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు.. రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్లను సిద్ధం చేసుకున్నారు. అనంతరం నిర్మాణాలు చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. వీటిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బై నంబర్లను వేసి..

రెవెన్యూ పరిధి కమ్మగూడలోని సర్వే నంబర్ 227, 228లో కొన్నేళ్ల క్రితం అను, మను పేరిట గ్రామ పంచాయతీ లే అవుట్‌ను చేసింది. ఆ సమయంలో మెదటి లే అవుట్‌లో 870 గజాల ఓపెన్ ల్యాండ్‌ను ప్రజా ప్రయోజనాల కోసం వదిలారు. ఆ తరువాత 2015లో ఆ భూమికి బై నంబర్లను వేసి 4 ప్లాట్లుగా మార్చి, పలువురు వ్యక్తులపై సేల్‌డీడ్ చేసుకున్నారు. ఇంటి నిర్మాణ అనుమతుల కోసం ప్రయత్నించగా.. నాటి కమ్మగూడ గ్రామ పంచాయతీ వాటిని తిరస్కరించింది. ఆ తరువాత మున్సిపాలిటీకి టీఎస్ బి పాసు ద్వారా దరఖాస్తు చేసినప్పటికీ తిరస్కరణకు గురయింది. హెచ్ఎండీఏకు అర్జీ పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. కానీ ఇటీవల అధికారులు కొన్ని ప్లాట్లకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

నాలుగు కోట్లకు పై మాటే..

సాగర్ రహదారికి సమీపాన ఉన్న ఈ భూమిని కబ్జా చేయడానికి కొందరు గతంలో చేయని ప్రయత్నం లేదు. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ.4 కోట్లకు పైగా ఉంది. అనేక మంది రాజకీయ నాయకులు, అధికారులను కలిసినప్పటికీ ఇది కొలిక్కి రాలేదు. తాజాగా ఇద్దరు వ్యక్తులు జేసీబీ సహాయంతో స్థలాన్ని చదును చేస్తుండగా.. కొందరు కాలనీ వాసులు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారు. మున్సిపల్ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకుని ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టరాదని ఆదేశించగా.. సదరు వ్యక్తులు మాట్లాడుతూ.. తాము 400 గజాల ప్లాటు తీసుకుంటామని, మిగిలిన ప్లాట్‌ను మున్సిపాలిటీకి వదిలేస్తామని చెబుతుండటం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, అన్యాక్రాంతం అవుతున్న పార్కులు, ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

చట్టరీత్యా చర్యలు



పార్కు స్థలాలు, ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూముల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాము. ఇప్పటికే కొన్నింటికి ప్రహరీలను నిర్మించాము. మిగిలిన వాటి రక్షణకు తగిన చర్యలు తీసుకుంటాము. ఆయా స్థలాలను ఎవరైనా కబ్జా చేయడానికి యత్నిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– కె.అమరేందర్ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్

పేదల కల సాకారం

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- కాంగ్రెస్ నాయకులు



ఇంటి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: పేద ప్రజల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తుందని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ అన్నారు. అర్హులెవరూ ఆందోళన చెందవద్దని, విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని తెలిపారు. శనివారం వారు స్థానిక నాయకులతో కలిసి మండల పరిధి చరికొండ గ్రామంలో పర్యటించారు. పలువురు లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో మండలంలో ఎవరికీ ఇళ్లు ఇవ్వలేదని, డబుల్ రూం పేరిట ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. నాడు వారు చేయని పనులు, నేడు కాంగ్రెస్ చేస్తుంటే.. ఓర్వలేని ఆ పార్టీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గ్రామ అధ్యక్షుడు మహేందర్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రేవంత్ మిత్రమండలి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆసిఫ్అలీ

కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో.. రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్అలీ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మిత్రమండలి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనుల వివరాలను ముఖ్యమంత్రికి వివరించామని ఆసిఫ్ తెలిపారు. ఆయన వెంట మిత్రమండలి వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ ఉన్నారు.

భరోసా నిధులు జమ చేయాలి

యాచారం: వానాకాలం సాగు నేపథ్యంలో.. ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం రాష్ట్ర నేత బి.మధుసూదన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి ఖర్చుల నిమిత్తం అన్నదాతలు అప్పులు చేయాల్సి వస్తుందని, వెంటనే భరోసా నిధులు అందజేసి ఆదుకోవాలన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

- అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.33 వేలు, మున్సిపాలిటీ పరిధి ముర్తుజపల్లి వాసి పుల్లయ్యకు రూ.2.5 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు శనివారం నగరంలోని ఆయన నివాసంలో బాధితులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, నాయకులు గ్యార నర్సింహ, జగన్‌గౌడ్, యాదయ్యగౌడ్, నరేందర్‌గౌడ్, భాస్కర్, కిషన్‌సింగ్, అంజన్‌రెడ్డి, కాలె మల్లయ్య, సుమన్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- పనిచేసే వారికి తగిన గుర్తింపు
- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి



ఎంపీ మల్లురవిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి అన్నారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా ఎన్నికైన తరువాత శనివారం తొలిసారిగా కడ్తాల్ మండల కేంద్రానికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలి

రూ.200 కోట్లతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీ తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని స్పష్టంచేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి, ప్రతిపక్ష నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ పదవుల విషయంలో ఎవరూ ఇబ్బంది పడొద్దని, పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జహంగీర్‌అలీ, చందోజీ, రాంచందర్‌నాయక్, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మడిగెలకు లభించిన మోక్షం

స్పందించిన అధికార యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..



వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన దుకాణ సముదాయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన దుకాణ సముదాయానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. మరో రెండు రోజుల్లో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రూ.1.20 కోట్లతో 17 మడిగెలను నిర్మించి రెండేళ్లు కావోస్తుంది. అయినా వినియోగంలోకి తేవడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో సముదాయం పరిస్థితిపై గత నెల 26న 'మోక్షం కలిగ్ంచి.. వదిలేసి' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి ఆలస్యంగానైనా పాలకులు, అధికారులు స్పందించారు. మిగతా మరమ్మతులను పూర్తిచేశారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు మడిగెలను వినియోగంలోకి తెచ్చేందుకు అనుమతించాలని లేఖ రాశారు. అనంతరం ఆయన అనుమతితో!.. ఈ నెల 17న సముదాయాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, అధికారులతో కలిసి ప్రారంభించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మడిగెలకు ఓపెన్ యాక్షన్ పెడతారా లేక ఆన్‌లైన్ టెండర్ నిర్వహిస్తారా అనే విషయం ప్రారంభం అనంతరం స్పష్టం కానుంది. దీంతో మార్కెట్‌కు మరింత ఆదాయం సమకూరనుంది.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారి సన్నిధిలో భక్తులు

కడ్తాల్: మండల పరిధి అన్మాస్‌పల్లి వీరాంజనేయ స్వామీ ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో సంతోష– దేవానాయక్ దంపతుల ఆధ్వర్యంలో అర్చనలు, విశేషపూజలు, సత్యనారాయణ వ్రత పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రంగయ్య, నాయకులు లాయక్‌అలీ, మహేశ్, శ్రీను, యాదయ్య, జాన్య, నిరంజన్‌గౌడ్, రమేశ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

ఐదేళ్ల గ్రహణం వీడింది



గొరారం ప్రాథమిక పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఎంఈఓ పాండు

ఆమనగల్లు: ఆకుతోటపల్లి పరిధిలోని గొరారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కళకళలాడుతోంది. ఇక్కడ విద్యార్థులు లేక ఐదేళ్ల క్రితం పాఠశాలను మూసివేశారు. ఈ ఏడాది మూతపడిన ప్రభుత్వ పాఠశాలను తిరిగి తెరిపించాలని, విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆమనగల్లు ఎంఈఓ పాండు, శెట్టిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి గొరారంలో గ్రామస్తులను కలిసి పాఠశాల పునఃప్రారంభానికి సహకరించాలని కోరారు. ఈ నెల 9న గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో గ్రామానికి చెందిన విద్యార్థులను స్థానిక ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని నిర్ణయించారు. ఈ మేరకు పాఠశాలకు డిప్యూటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయుడు శ్రీనివాసాచారి ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పంపించాలని కోరారు. గ్రామానికి చెందిన 15 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. నాడు విద్యార్థులు లేక మూతపడిన గొరారం ప్రాథమిక పాఠశాల నేడు విద్యార్థులతో కళకళలాడుతుంది. త్వరలోనే గొరారం ప్రాథమిక పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని పంపిస్తామని ఎంఈఓ పాండు వివరించారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

మంచాల: రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మొద్దు సికిందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రోజుల తరబడి వరి కుప్పలతో కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాసినా.. నిర్వాహకులు సేకరించలేదని, దీంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన సన్న వడ్లకు బోనస్ డబ్బులు లేదని పేర్కొన్నారు. ఎండకాలం పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారని, రైతు భరోసా కింద పెట్టు బడి సాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఎరువులు, విత్తనాలు కూడా అందుబాటులో ఉంచాలన్నారు. సాగు పరికరాలను రాయితీపై అందించాలన్నారు.

16న ఉచిత కంటి శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 16న ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాషాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చూపు మందగించిన వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువత స్వయం కృషితో ఎదగాలి

కడ్తాల్: యువత స్వయం కృషితో ఎదగాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధి సలార్‌పూర్ గ్రామంలో మౌనిక– మహేశ్ దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ స్టూడియోను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉన్నత విద్యను అభ్యసించిన యువత.. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా, స్వశక్తితో ఎదగాలని, అందుకు ఉపాధి రంగాలను ఎంచుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి పొందే యువతకు, ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలి, మాజీ ఎంపీటీసీ రమేశ్, మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, స్థానిక నాయకులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

కొందుర్గు: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చెన్నారెడ్డిగూడలో శనివారం ఏర్పాటు చేసిన సీపీఐ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఉపాధి కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. పేదలు డబ్బులు లేకనే ఇళ్లు కట్టుకోవడం లేదని, లబ్ధిదారులు ఇల్లు కట్టుకున్నాక విడతల వారీగా బిల్లులు ఇస్తామనడం సబబు కాదన్నారు. ముందుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు లింగం, రాజు, జంగయ్య, చంద్రయ్య, రమేశ్, భీమయ్య, బుచ్చయ్య, మల్లమ్మ, మాణెమ్మ పాల్గొన్నారు.

చిన్నపిల్లల హెల్త్ క్యాంప్

షాబాద్: పుట్టిన ఆరు సంవత్సరాలలోపు పిల్లల్లో ఆలోచన, జ్ఞాపకశక్తి, భాష సమస్య పరిష్కార నైపుణ్యాలను తెలుసుకోవడానికి స్కానింగ్ చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చందనవెళ్లిలో మైక్రోసాఫ్ట్ వారి సహకారంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, చందనవెళ్లి వీడీసీ అడ్వైజర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఇందులో 60 మంది పిల్లలకు టెస్టులు చేసి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

- స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం
- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పిలుపునిచ్చారు. తమ్మలోనిగూడ గ్రామంలో శనివారం పార్టీ మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కేంద్రంలోని బీజేపీ కార్మికులకు, రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కార్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని సరిగా అమలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమానికి ముందు జెండా విష్కరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు పి. అంజయ్య, బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్, పెద్దయ్య, జగన్, లాజర్, విప్లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న యాదయ్య